TRUTH | PEOPLE | NATION

ప్రజల పక్షం.. ప్రజా స్వరం..

# రిపబ్లిక్ హిందుస్థాన్

REPUBLIC HINDUSTHAN TELUGU DAILY

NEWS VIEWS FOR A BETTER TOMORROW

సత్యం కోసం.. సమాజం కోసం.. భారతం కోసం..

సంపుటి: 2 సంచిక: 138 | గురువారం 01-10-2026 | ఆదిలాబాద్ | హైదరాబాద్ | ఎడిటర్ : రాటోడ్ రాజు | పేజీలు : 4 | వెల: రూ.2.00



## ఎమ్మెల్సీ టికెట్లపై తీన్మార్ మల్లన్న ఫైర్..

జానారెడ్డి కుట్ర అంటూ సంచలన ఆరోపణ రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించిన కాంగ్రెస్‌రెండు స్థానాలు రెడ్లకే ఇచ్చారని తీన్మార్ మల్లన్న విమర్శరాష్ట్రంలో బీసీ వాదం లేదని నిరూపించే ప్రయత్నం జరుగుతోందని మండిపాటుతెలంగాణలో రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాలకు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను ప్రకటించడం రాజకీయంగా వేడి పుట్టించింది. రెండు సీట్లనూ రెడ్డి సామాజిక వర్గానికే కేటాయించడంపై తెలంగాణ రాజ్య అధికార పార్టీ నేత, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న తీవ్ర ఆరోపణలు చేశారు. దీని వెనుక పెద్ద కుట్ర దాగి ఉందని, సీనియర్ నేత జానారెడ్డి నాటకమాడారని సంచలన వ్యాఖ్యలు

2వ పేజీలో...



## 1096.22 కోట్లతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు

# శంకుస్థాపన...

**ముఖ్యమంత్రికైనా, ప్రధానమంత్రికైనా మంచి పేరు రావాలంటే ఉద్యోగుల సహకారంతోనే సీఎం రేవంత్ రెడ్డి**

**28.70 కోట్లతో నిర్మించిన వివిధ అభివృద్ధి భవనాలను ప్రారంభించిన ముఖ్యమంత్రి**

**51 కోట్లతో నిర్మించిన కరీంనగర్ సమీకృత జిల్లా కార్యాలయ సముదాయాన్ని ప్రారంభించిన సీఎం**

జననినాదం, కరీంనగర్ సెప్టెంబర్ 30:సమస్యతో బాధతో, నిస్సహాయ స్థితిలో కలెక్టరేట్ గడప తొక్క ప్రతి పేదవాడికి ప్రభుత్వం అండగా ఉందనే నమ్మకం కలిగించేలా సమీకృత జిల్లా కలెక్టరేట్ పనిచేయాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అన్నాడ. ప్రజల సమస్యలను కుటుంబ సభ్యుల సమస్యలుగా భావించి పరిష్కరించాలని వారి కన్నీరు తడవాలని పేర్కొన్నారు. ప్రజలకు నమ్మకం, భరోసా కల్పించే విధంగా పనిచేయాలన్నారు. బుధవారం కరీంనగర్ జిల్లాలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. కరీంనగర్ జిల్లా పర్యటనకు విచ్చేసిన



2వ పేజీలో...

## ఓటర్ల జాబితా వివాదం...

## నేడు ఇండియా కూటమి కీలక భేటీ



**సీఈసీ జ్ఞానేష్ కుమార్ రాజీనామాకు ప్రతిపక్షాల పట్టు**

**సీఈసీ తొలగింపుపై పార్లమెంటులో నోటీసు ఇచ్చేందుకు వ్యూహరచన**

**భేటీకి దూరంగా డీఎంకే, ఆమ్ ఆద్మీ పార్టీ**

**దేశవ్యాప్త ఆందోళనలకు సిద్ధమవుతున్న విపక్షాలు**

ఎన్నికల ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలు, ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేష్ కుమార్ రాజీనామా డిమాండ్ నేపథ్యంలో ఇండియా కూటమి నేడు ఢిల్లీలో కీలక సమావేశం నిర్వహిస్తోంది. ఉదయం 11 గంటలకు ప్రారంభం కానున్న ఈ భేటీలో కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘంపై ఉమ్మడి పోరుకు సంబంధించిన భవిష్యత్ కార్యాచరణపై చర్చించనున్నారు. ఓటర్ల జాబితా నుంచి సుమారు

2వ పేజీలో...



## సింగరేణి ఓసిపి లు కాంట్రాక్టర్ల మయం అయ్యాయి

**కాళేశ్వరం ప్రాజెక్టులో లోపాలు సరిచేసి నీటిని ఎత్తిపోసి రైతాంగానికి సాగునీరు అందించాలి ఎంపి ఈటల**

2వ పేజీలో...

పెద్దపల్లి30: మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ బుధవారం రామగుండంలో పర్యటించారు. స్థానిక బిజెపి నాయకులు అయనకు ఘన స్వాగతం పలికారు. ఎన్టీపీసీ కృష్ణానగర్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పాల్గొన్నారు. ఈటల మాట్లాడుతూ సింగరేణి లో ఉన్న కార్మికులను యాజమాన్యం అనేక ఇబ్బందులకు గురిచేస్తోంది. ఓసిపి లు కాంట్రాక్టర్ల మయం అయ్యాయి. సింగరేణి కార్మికులకు కేసీఆర్ అనేక హామీలు ఇచ్చి విస్మరించారు. వేలాది కోట్ల రూపాయల డిపాజిట్లతో కళలాడిన సింగరేణి ఇప్పుడు అప్పుల ఉబిలో నెట్టవేయబడింది. సింగరేణి కార్మికులకు జీతాలు ఇవ్వాలంటే బ్యాంకుల చుట్టూ తిరిగే పరిస్తితి నెలకొందని అన్నారు. ఒక విధంగా సింగరేణి మూసివేసి పరిస్థితి కి వచ్చింది. తక్షణమే సింగరేణి కార్మికులకు ఇచ్చిన హామీల అమలు తో పాటు లాభాల వాటాను ప్రకటించాలని డిమాండ్

## ఆసియా క్రీడల్లో ఆర్చర్ చికితకు ఒకేరోజు రెండు స్వర్ణాలు..

**సీఎం రేవంత్ రెడ్డి అభినందన**

ఆసియా క్రీడల్లో తెలంగాణ ఆర్చర్ చికితకు రెండు స్వర్ణాలుచికితను అభినందించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిరాష్ట్రానికి గర్వకారణంగా నిలిచారని ప్రశంసఈ విజయంతో 2028 ఒలింపిక్స్‌కు అర్హత సాధించిన చికితపెద్దపల్లి జిల్లాకు చెందిన క్రీడాకారిణి చికితఆసియా క్రీడల్లో ఒకే రోజు రెండు స్వర్ణ పతకాలు సాధించి సత్తా చాటిన తెలంగాణ ఆర్చరీ క్రీడాకారిణి తానిపర్తి చికితా రావును ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందించారు. తన అద్భుత విజయంతో చికిత తెలంగాణ రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచిందని, రాష్ట్ర ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేసిందని కొనియాడారు. ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డి తన 'ఎక్స్' ఖాతాలో పోస్ట్ చేస్తూ, చికిత పట్టుదల, నిరంతర సాధన, దృఢ సంకల్పం యువ క్రీడాకారులకు ఎంతో స్ఫూర్తినిస్తాయని పేర్కొన్నారు. ఆమె ప్రతిభను గుర్తించి వెన్నంటి నిలిచిన తల్లిదండ్రులకు, శిక్షణ ఇచ్చిన కోచ్‌లకు కూడా ముఖ్యమంత్రి ఈ సందర్భంగా ప్రత్యేక అభినందనలు తెలిపారు. పెద్దపల్లి జిల్లాకు చెందిన చికిత.. ఆసియా క్రీడల్లో కాంపౌండ్ ఉమెన్స్ టీమ్,



మిక్స్‌డ్ టీమ్ విభాగాల్లో స్వర్ణ పతకాలను కైవసం చేసుకుంది. ముఖ్యంగా, మిక్స్‌డ్ టీమ్‌లో తన భాగస్వామి సాహిల్ జాదవ్‌తో కలిసి సాధించిన ఈ విజయంతో ఆమె 2028 లాస్ ఏంజిల్స్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించడం విశేషం. ఈ విజయం తెలంగాణ క్రీడా రంగంలో నూతనోత్సాహాన్ని నింపింది.

## గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థులపై దుమారం..

**కాంగ్రెస్‌ను నిలదీసిన కవిత గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలపై కాంగ్రెస్ అభ్యర్థుల ప్రకటన**

**రెండు స్థానాల్లోనూ రెడ్డి సామాజిక వర్గానికే అవకాశం**

**ఇది సామాజిక అన్యాయమంటూ కవిత తీవ్ర విమర్శ**

తెలంగాణలో జరగనున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల అభ్యర్థుల విషయంలో కాంగ్రెస్ పార్టీపై తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తీవ్ర విమర్శలు చేశారు. రెండు ఎమ్మెల్సీ స్థానాలనూ రెడ్డి సామాజిక వర్గానికే కేటాయించడం పూర్తి సామాజిక అన్యాయమని ఆమె ఆరోపించారు. మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానానికి సామ రామ్మోహన్ రెడ్డిని,



నల్గొండ-ఖమ్మం-వరంగల్ స్థానానికి రామిరెడ్డి సర్వోత్తమ్ రెడ్డిని కాంగ్రెస్ పార్టీ అధికారికంగా ప్రకటించింది. ఈ ఇద్దరు అభ్యర్థులు రెడ్డి సామాజిక

2వ పేజీలో.

## కాంగ్రెస్ పార్టీలోకి జగన్ చేరుతారంటూ ప్రచారం జరుగుతున్న వేళ..

# మల్లు భట్టి కీలక వ్యాఖ్యలు!

**జగన్, మమత, పవార్ కాంగ్రెస్ లోకి తిరిగి రావాలన్న మల్లు భట్టి**

**కాంగ్రెస్ను వీడిన వారంతా వెనక్కి రావాలని పిలుపు**

**సీఎం రేవంత్తో తనకు ఎలాంటి విభేదాలు లేవని స్పష్టీకరణ**

**నేతలను కులం కోణంలో చూడకూడదని వ్యాఖ్య**

**గ్యారెంటీ పథకాలు ఉచితాలు కావన్న డిప్యూటీ సీఎం**



వైసీపీ అధినేత జగన్ తిరిగి కాంగ్రెస్ పార్టీలోకి చేరే అవకాశాలున్నాయంటూ పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో, తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చేసిన వ్యాఖ్యలు ఆసక్తిని రేపుతున్నాయి. జగన్, మమతా బెనర్జీ, శరద్ పవార్ వంటి కాంగ్రెస్ పార్టీ మాజీ నేతలు తిరిగి సొంత గూటికి రావాలని ఆయన పిలుపునిచ్చారు. వారంతా పార్టీలోకి వస్తే అందరికంటే తానే ఎక్కువ సంతోషిస్తానని అన్నారు. కొచ్చిలో జరిగిన ఇండియా టుడే కాన్క్లేవ్ సౌత్ 2026లో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. దివంగత నేత వైఎస్ రాజశేఖర రెడ్డితో కలిసి పనిచేసిన విషయాన్ని గుర్తు చేసుకున్న భట్టి... జగన్తో నేరుగా పనిచేయకపోయినా, పాత నేతలంతా తిరిగి వస్తే దేశాన్ని, పార్టీ సిద్ధాంతాలను బలోపేతం చేసినవారవుతారని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో తనకు ఎలాంటి విభేదాలు లేవని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. నేతలను కులం కోణంలో చూడకూడదని, తామిద్దరం ఐక్యంగా, సమష్టి నిర్ణయాలతో ప్రభుత్వాన్ని నడుపుతున్నామని వివరించారు.

2వ పేజీలో.

## పేరు మార్చినంత మాత్రాన సిద్ధాంతం, నాయకత్వం మారదు

**తెలుగు గడ్డపై పుట్టిన పార్టీ జాతీయ స్థాయికి ఎందుకు విస్తరించ కూడదన్న కేటీఆర్**

**నా పేరు షారుఖ్ ఖాన్ అని పెట్టుకుంటే షారుఖ్ అవుతానా? అని ప్రశ్న**

**తదుపరి సీఎం కేసీఆర్ అని ధీమా**



పార్టీ పేరును టీఆర్ఎస్ నుంచి బీఆర్ఎస్ మార్చినంత మాత్రాన తమ సిద్ధాంతం, ఆలోచనా విధానం, నాయకత్వం మారబోవని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. "నా పేరు షారుఖ్ ఖాన్ అని పెట్టుకుంటే నేను షారుఖ్ ఖాన్ అయిపోతానా అని ఆయన ప్రశ్నించారు. ఇండియా టుడే కాన్క్లేవ్లో మాట్లాడిన ఆయన, పార్టీ పేరు మార్పుపై వివరణ ఇచ్చారు. తెలుగు ఇండియా స్థాయిలో విజయం సాధిస్తు న్నప్పుడు, తెలుగు గడ్డపై పుట్టిన రాజకీయ పార్టీ కూడా జాతీయ స్థాయిలో ఎందుకు విస్తరించకూడదని

## దేశాన్ని కాంగ్రెస్ పార్టీ చీలుస్తోంది

**ముఖ్యమంత్రి బాధ్యతాయుతంగా మాట్లాడాలి**

**కేంద్రమంత్రి బండి సంజయ్**

జననినాదం,కరీంనగర్ 30: 840 కోట్ల రూపాయల అర్బన్ ఛాలెంజ్ ఫండ్ యూసీఎఫ్ నిధులతో చేపట్టిన అనేక పనులకు సీఎం చేతుల మీదుగా శంకుస్థాపన జరిగింది. నగరంలో చెత్త నిర్వహణ, పాత చెత్త డంప్యార్డుల శుద్ధీకరణ, నదీతీర అభివృద్ధి, పట్టణ రవాణా మెరుగుదల, డ్రైనేజీ వ్యవస్థల అభివృద్ధి, పునరావాసం, వరదల ప్రభావాన్ని తగ్గించే మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులున్నాయని కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. బుధవారం నాడు అయన కలెక్టరేట్



## ముఖ్యమంత్రి సభ విజయవంతానికి పకడ్బందీ ఏర్పాట్లు

సిరిసిల్ల30:సిరిసిల్ల జిల్లాలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటనను విజయవంతం చేసేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు. సభకు పెద్ద సంఖ్యలో ప్రజలు తరలిరానున్న నేపథ్యంలో పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ, తాగునీరు, వైద్య సదుపాయాలు, విద్యుత్, పారిశుద్ధ్య ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులకు సూచించాను. సభా ప్రాంగణంలో ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి గారి పాదయాత్ర నేపథ్యంలో మార్గమంతా భద్రతా ఏర్పాట్లు, బారికేడింగ్, ట్రాఫిక్ మళ్లింపులను పకడ్బందీగా చేపట్టాలని సూచించారు. ముఖ్యమంత్రి రాక సందర్భంగా పార్టీ శ్రేణులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనే అవకాశం ఉన్నందున సభా ప్రాంగణంలో క్రమశిక్షణ, భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని కోరుతున్నాను. సభను విజయవంతం చేసేందుకు కాంగ్రెస్ శ్రేణులు, ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ల ఆది శ్రీనివాస్, వేముల వీరేశం, ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, బత్తుల లక్ష్మారెడ్డి, డీసీసీ అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్తో పాటు ఇతర ముఖ్య నేతలు పాల్గొన్నారు



# 1096.22 కోట్లతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన...

మొదటిపేజీ తరువాయి...

ముఖ్యమంత్రిబృందానికి జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా. పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం పున స్వాగతం పలికారుకరీంనగర్లో రూ.51 కోట్లతో నూతనంగా నిర్మించిన సమీకృతజిల్లా కలెక్టరేటియు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్, ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇన్చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మంత్రులు పొన్నం ప్రభాకర్ దుద్దిళ్ల శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఎమ్మె పీసీసీ చీఫ్ మహేష్ కమార్ గౌడ్ జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా పోలీస్ మొషనర్ గౌష్ ఆలం, ఉన్నతాధికారులతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు ఆనంతరం కలెక్టరేట్ ఆవరణలో ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లివిగ్రహాన్ని ఆవిష్కరించారు.. 29.62 కోట్లతో జిల్లాలో చేపడుతన్న మూడు తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ నిర్మాణ పనులకు అర్బన్ ఛాలెంజ్ ఫండ్ కింద రూ.8-43 కోట్లతో కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనులకు ఐ. ఎన్ స్క్రీన్. ఎట్ స్పెషల్ గ్రాంట్స్ కింద రూ. 2160 కోట్లతో చేపట్టి వరదనీటి మురుగ కాల్వల నిర్మాణ పనులకు రూ. 25 కోట్లతో చేపట్టకున్న మల్టీ లెవెల్కార్ పార్కింగ్ బిల్డింగ్ నిర్మాణ పనులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తండస్థాపన చేశారు. 5. 70 కోట్లతో నిర్మించిన సెంట్రల్ లైబ్రరీ భవనాన్ని రూ. 6.50



కోట్లతో నిర్మించిన కాశ్మీర్ గడ్డ సమీకృత వెజ్.. నాన్ వెజ్ మార్కెట్లు, రూ16.50 కోట్లతో నిర్మించిన ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ డిజెర్ఫ్ కార్యాలయాలను ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఆనంతరు జిల్లా కలెక్టర్ ఛాంబర్ ను ముఖ్యమంత్రి సందర్శించారు. వేద మంత్రాల సర్వమత ప్రార్ధనల మధ్యజిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రాను కలెక్టర్ కుర్రీలో కూర్చోబెట్టారు. అనంతరం ఇన్చార్జి మంత్రి కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక స్టేట్ చాంబర్ కు ముఖ్యమంత్రి పరిశీలించారు. నూతన కలెక్టరేట్ లోని సమావేశమందిరంలో ప్రత్యేకంగా ఆహ్వానితులైన జిల్లా ప్రముఖులు, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమావేశమయ్యారు.

# దేశాన్ని కాంగ్రెస్ పార్టీ చీలుస్తోంది

మొదటిపేజీ తరువాయి...

దగ్గర మీడియాతో మాట్లాడారు. స్మార్ట్ సిటీ మిషన్ కింద 5 కోట్ల 70 లక్షల రూపాయల వ్యయంతో సెంట్రల్ లైబ్రరీని ప్రారంభించాం. 16 కోట్ల 50 లక్షల రూపాయలతో నిర్మించిన ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్, డీఆర్ఎఫ్ బిల్డింగ్ ను ప్రారంభించుకున్నాం.కశ్మీరీ గడ్డలో 6 కోట్ల 50 లక్షల రూపాయలతో నిర్మించిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ను ప్రారంభించుకున్నామని అన్నారు. వర్షపు నీటి డ్రెయిన్ల నిర్మాణం కోసం 21 కోట్ల రూపాయలతో పనులకు శంకుస్థాపన జరిగింది. కరీంనగర్ టవర్ సర్కిల్ వద్ద పార్కింగ్ సమస్య లేకుండా 25 కోట్ల రూపాయలతో మల్టీ లెవల్ కార్ పార్కింగ్ నిర్మాణ పనులకు ఈరోజు శంకుస్థాపన చేయడం ఆనందంగా ఉంది. ఈనెల 4న కేంద్ర హోంమంత్రి అమిత్ షా కరీంనగర్ వస్తున్నారు. సంఘ్ పరివార్ లేని భారత్ ను ఊహించుకునే స్థితిలో ప్రపంచమే లేదు. కాంగ్రెస్ లేని భారత్ ను చూడాలని దేశ ప్రజలంతా ఎదురు చూస్తున్నారు. అందుకే కాంగ్రెస్ 3, 4 రాష్ట్రాలకే పరిమితమైంది. 370 ఆర్టికల్ ను మళ్లీ ప్రవేశపెట్టాలని సిలబస్ లో చేరుస్తారా, కాశ్మీర్ పాకిస్తాన్ లో అంతర్భాగమని చెబుతారా. అయోధ్యలో రామ మందిరం లేదు బాబ్రీ మసీదు ఉందని చెబుతారా, సర్జికల్ స్ట్రయిక్స్ లేవు పాకిస్తాన్ వాళ్లే వచ్చి దాడులు చేయాలని చెబుతారా, సైనికులకు మోదీ స్వేచ్ఛ ఇచ్చారు ఇవ్వొద్దని సిలబస్ లో చెబుతారా, నిజాం చాలా గొప్పోడని సిలబస్ లో చెబుతారా హిందు దేవాలయాలపై దాడులు చేయాలని, మహిళలను అర్ధ నగ్నంగా బతకమ్మలా ఆడించాలని చెబుతారా, రజాకార్ల దాడుల్లో అసువులు బాసిన వారి చరిత్రను తెరమరుగు చేస్తారా, సర్దార్ పటేల్ వద్దు నిజాం ముద్దు అని చెబుతారా అని ప్రశ్నించారు.

దేశాన్ని కాంగ్రెస్ పార్టీ చీలుస్తోంది. హిందూ సమాజాన్ని చీల్చాలని కుట్ర చేస్తోంది. దేశమంతా హరహర మహాదేవ్ అని మార్మోగుతోంది. మోదీ ప్రాతినిధ్యం వహిస్తోంది వారణాసి నుండే కదా. సర్వే జన సుఖినోభవంతు అన్నదే హిందూ ధర్మం. రాముడిని బీజేపీకే పరిమితం చేసినందుకు సీఎంకు థ్యాంక్స్ చెప్పాలేమో. దేవుళ్లను విభజిస్తున్న సీఎంను చూసి కాంగ్రెస్ నేతలే అసహ్యించుకుంటున్నారు.. ముఖ్యమంత్రి బాధ్యతాయుతంగా మాట్లాడాలి. రాముడు, శివుడి పేరుతో దైవాన్ని చీల్చాలనుకుంటే హిందూ సమాజం తిరగబడటం తథ్యమని అన్నారు.

# సింగరేణిలో40 లక్షల టన్నుల బొగ్గును మాయం చేశారు

**: బాల్క సుమన్**

**హైదరాబాద్ 30:** సింగరేణి సంస్థను రాష్ట్ర ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ అన్నారు. బుధవారం తెలంగాణ భవన్లో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. బొగ్గు గనుల ప్రైవేటీకరణ అడ్డుకుంటామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. సింగరేణిని అవినీతి మయం చేశారని ఆరోపించారు. సీఎం రేవంత్ రెడ్డి బామ్మర్ది సృజన్ రెడ్డి కింగ్ పిన్గా అవినీతి జరుగుతోందన్నారు. జైపూర్ పవర్ ప్లాంట్ లో 334 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి మాత్రమే జరుగుతోంది. సింగరేణిలో40 లక్షల టన్నుల బొగ్గును మాయం చేశారని మండిపడ్డారు. ఒక్కో కార్మికుడికి లాభాల్లో లక్షా 80 వేల కోట్లు తక్కువగా ఇస్తున్నారు.సింగరేణి డబ్బులను సీఎం రేవంత్ రెడ్డి ఫుట్ బాల్ సోకులకు ఖర్చు పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సింగరేణి అవినీతిపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి కేటీఆర్ లెటర్ రాశారు. కార్మికులకు నికర లాభాల్లో 36 శాతం వాటా ఇవ్వాలని కేటీఆర్ డిమాండ్ చేసిన విషయాన్ని గుర్తు చేశారు. సింగరేణి సంస్థలో రాష్ట్ర ప్రభుత్వ వాటా 51 శాతాన్ని ప్రైవేట్ వాళ్లకు అమ్ముకోవాలని చూస్తోందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి డైరెక్షన్ మేరకు డిప్యూటీ సీఎం భట్టి, అధికారులు తెరవెనుక ప్రయత్నాలు చేస్తున్నారు. సింగరేణి అంటే సిరుల గని.సిరిసిల్లకు ఎన్ని నిధులిస్తారో చెప్పాలిసింగరేణి సంస్థను ఎవరికైనా అమ్మితే పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. అక్టోబర్ 5 వ తేదీన తెలంగాణ భవన్ లో సింగరేణి కోల్ బెల్ట్ ఏరియాలో ఉన్న అసెంబ్లీ నియోజకవర్గ ఇంఛార్జిలు, కార్మిక సంఘం నేతలతో కేటీఆర్



మీటింగ్ ఉంటుందన్నారు. సిరిసిల్లను కేటీఆర్ ఎంతో అభివృద్ధి చేశారు. రేవంత్ రెడ్డికి మైక్ దొరికితే తిట్టడం తప్ప వేరే పని లేదన్నారు. సిరిసిల్లకు రేవంత్ రెడ్డి ఎన్ని నిధులు ఇస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. రేవంత్ రెడ్డి సిరిసిల్లకు టూరిస్ట్ లాంటి వారు. నాయకులను ఓడగొట్టడం, గెలిపించడం ప్రజల చేతుల్లో ఉంటుందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత నేతన్నల ఆత్మహత్యలు జరుగుతున్నాయి. కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావు చుట్టూ రేవంత్ రెడ్డి రాజకీయం తిప్పుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణకు 45 టీఎంసీలు ఇవ్వొద్దని సీడబ్ల్యూసీకి చంద్రబాబు లేఖలు రాస్తున్నారు. నాన్ బేసిన్ కుప్పంకు కృష్ణా నది నీళ్లను తరలించారు.గురువు కండ్లలో ఆనందం కోసం రేవంత్ రెడ్డి తెలంగాణను ఎండబెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంకో 20 ఏళ్లు రాష్ట్రంలో కాంగ్రెస్ మొలకెత్తదన్నారు.

# భూముల రీ-సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

**సిద్దిపేట 30:** భూముల రీ-సర్వేను పకడ్బందీగా నిర్వహించాలనీ జిల్లా కలెక్టర్ కె. హైమావతి సర్వే అధికారులను ఆదేశించారు. సిద్దిపేట రూరల్ మండలం పుల్లూరు గ్రామం మరియు దుబ్బాక మండలం పద్మనాభునిపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న భూ భారతి-భూ సర్వే, రీ-సర్వే ప్రక్రియ ను జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ. భూముల సర్వే చాలా కాలం నుండి పెద్ద సమస్యగా మారిందని గ్రహించిన ప్రభుత్వం భూ సర్వే చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ఈ రి-సర్వే కోసం ఆరు ఏడు లక్షలతో అధునాతన పద్ధతులు సర్వే చేయడానికి రోవర్స్ లను కొనుగోలు చేసిందని, దీనివల్ల అత్యంత ఖచ్చితత్వంతో భూములను కొలిచి పగడ్బందీగా హద్దులను ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. భూములలో కొనుగోలు చేయడం అమ్మడం మూలంగా సర్వే నంబర్లలో సబ్ నెంబర్లు మారడం, పట్టా ఒకరిది కబ్జాదారులు ఒకరుగా ఉన్నాయని ఇలాంటి సమస్యలకు ఈ రీ-సర్వేలో ఖచ్చితమైన పరిష్కారాన్ని సూచిస్తున్నట్లు అందుకుగాను రైతులు, అధికారులకు సహకారం అందించాలని తెలిపారు. రీ-సర్వే ప్రక్రియను ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా పకడ్బందీగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. రీ సర్వే ద్వారా అనేక భూ సమస్యలకు పరిష్కారం లభించే అవకాశం ఉన్నందున ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, ఖచ్చితత్వంతో నిర్వహించాలని సూచించారు.రీ సర్వే చేపట్టే ముందు రైతులకు ముందుగానే సమాచారం అందించాలని, రైతుల సమక్షంలోనే భూముల సర్వే ప్రక్రియను నిర్వహించాలని ఆదేశించారు. ప్రతి



భూమి హద్దులను, కోఆర్డినేట్లను ఖచ్చితంగా గుర్తించి నమోదు చేయాలని సూచించారు. రీ సర్వేలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నందున భూముల హద్దులు, కోఆర్డినేట్ల నమోదులో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు.రీ సర్వే పూర్తయిన అనంతరం ప్రతి రైతుకు వారి భూమికి సంబంధించిన మ్యాప్ను ఖచ్చితమైన కోఆర్డినేట్లతో అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. భవిష్యత్తులో భూ వివాదాలకు అవకాశం లేకుండా రీ సర్వే ప్రక్రియను నాణ్యతతో పూర్తి చేయాలని ఆదేశించారు.వచ్చే యాసంగిలో రైతులు ఎవ్వరు కూడా వరి ధాన్యం పండించకూడదని, ఆరుతడి పంటల సాగు చెయ్యాలని యాసంగిలో నీటి కొరత తీవ్రంగా ఉంటుందని జిల్లా రైతాంగానికి విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో రూరల్ తహసిల్దార్ రహమాన్, ఆయా మండల సర్వే అధికారులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## పేరు మార్చినంత మాత్రాన సిద్ధాంతం,

# నాయకత్వం మారదు

మొదటిపేజీ తరువాయి...

కేటీఆర్ అన్నారు. తెలంగాణలో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి పథకాలను దేశంలోని ఇతర ప్రాంతాలకు విస్తరించాలనే ఉద్దేశంతోనే సినిమాలు పాన్-పార్టీ పేరు మార్చామని తెలిపారు. రెండేళ్లలో కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావడం ఖాయమని, కాంగ్రెస్ పాలనపై ప్రజలు పూర్తిగా విసిగిపో యారని ఆయన జోస్యం చెప్పారు. తదుపరి సీఎం కేసీఆరేనని, తాను కాదని ప్రజలు కోరుకుంటున్నారని స్పష్టం చేశారు.ఈ సందర్భంగా బీజేపీ, కాంగ్రెస్లపై కేటీఆర్ విమర్శలు గుప్పించారు. మత ప్రాతిపదికన దేశాన్ని విభజించేందుకు బీజేపీ కుట్ర చేస్తోందని ఆరోపించారు. ప్రజలు పూజించే రాముడు, శివుడి మధ్య తేడాలు సృష్టిం చేందుకు సీఎం రేవంత్ రెడ్డి ప్రయత్నిస్తున్నారని అన్నారు. ఉద్యోగాల కల్పన, ఎన్నికల హామీల అమలు వంటి ప్రజా సమస్యల నుంచి దృష్టి మళ్లించడమే ఈ రెండు జాతీయ పార్టీల విధానమని విమర్శించారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఎన్నికల సంఘం విశ్వసనీయతపై తీవ్రమైన సందేహాలు తలెత్తుతున్నాయని కేటీఆర్ అన్నారు.ఈసీ పనితీరుపై ఇటీవల ఓ జాతీయ మీడియా చేసిన పరిశోధనలో వెల్లడైన అంశాలు నిజమేనని చాలామంది నమ్ముతున్నారని, దీనిపై సుప్రీంకోర్టు సుమోటోగా విచారణ చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై తీవ్ర ప్రజా వ్యతిరేకత ఉందని, అయితే ప్రధాన ప్రతిపక్ష నేతగా రాహుల్ గాంధీ యువతతో కలిసి నడవడంలో విఫలమయ్యారని విమర్శించారు.

# గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థులపై దుమారం..

మొదటిపేజీ తరువాయి...

వర్గానికి చెందినవారే కావడంతో రాజకీయంగా చర్చనీయాంశమైంది. ఈ నిర్ణయంపై సోషల్ మీడియా వేదికగా కవిత స్పందించారు. "రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ సీట్లు... రెండు చోట్లా రెడ్డి నేతలకే టికెట్లు... ఇది పూర్తి సామాజిక అన్యాయం కాదా.. అని ఆమె ప్రశ్నించారు. ప్రజాస్వామ్యంలో బలహీన వర్గాలకు తగిన ప్రాతినిధ్యం కల్పించాల్సిన బాధ్యత అధికార పార్టీపై ఉంటుందని, కేవలం ఒకే వర్గానికి ప్రాధాన్యం ఇవ్వడం తెలంగాణ ఆత్మగౌరవానికి విరుద్ధమని ఆమె పేర్కొన్నారు.

# ఓటర్ల జాబితా వివాదం...

మొదటిపేజీ తరువాయి...

13 కోట్ల పేర్లను అక్రమంగా తొలగించారని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. ఎస్ఐఆర్ ప్రక్రియపై ఎన్నికల కమిషన్లోనే అంతర్గత విభేదాలున్నాయని, ఇద్దరు కమిషనర్లు పలుమార్లు అభ్యంతరాలు తెలిపారని మీడియా కథనాలు రావడంతో ఈ వివాదం మరింత ముదిరింది. ఈ నేపథ్యంలో ఎస్ఐఆర్ ప్రక్రియను తక్షణమే నిలిపివేసి, తొలగించిన ఓటర్ల పేర్లను తిరిగి చేర్చాలని, సీఈసీ తన పదవికి రాజీనామా చేయాలని కూటమి డిమాండ్ చేస్తోంది. ఈ సమావేశంలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, సోనియా గాంధీతో పాటు తృణమూల్ కాంగ్రెస్, ఎస్పీ, వామపక్షాలు, ఎన్సీపీ (ఎస్పీ), శివసేన (యూబీటీ) నేతలు పాల్గొంటున్నారు. సీఈసీని తొలగించేందుకు పార్లమెంటు ఉభయ సభల్లో కొత్తగా అభిశంసన నోటీసు ఇవ్వడం, దేశవ్యాప్త ఆందోళనలు చేపట్టడం వంటి అంశాలపై చర్చించి తుది నిర్ణయం తీసుకోనున్నారు. అయితే, ఈ కీలక సమావేశానికి డీఎంకే, ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) దూరంగా ఉంటున్నాయి. తాము ఇండియా కూటమిలో భాగం కాదని 'ఆప్' ఇప్పటికే స్పష్టం చేయగా, తమిళనాడులో కాంగ్రెస్తో ఉన్న విభేదాల కారణంగా డీఎంకే హాజరుకావడం లేదు. సమాజ్వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్ కూడా వ్యక్తిగతంగా హాజరుకాకుండా తన ప్రతినిధులను పంపుతున్నారు. నిన్న జరిగిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశంలో సీఈసీని "ప్రభుత్వ కీలుబొమ్మ"గా అభివర్ణించిన కాంగ్రెస్.. ప్రధాని, హోంమంత్రి రాజీనామా చేయాలని కూడా తీర్మానించింది.

# ఎమ్మెల్సీ టికెట్లపై తీన్మార్ మల్లన్న ఫైర్..

మొదటిపేజీ తరువాయి...

చేశారు.మహబూబ్నగర్-రంగారెడ్డి-హైదరాబాద్ స్థానానికి సామ రామ్మోహన్ రెడ్డిని, నల్గొండ-ఖమ్మం-వరంగల్ స్థానానికి రామిరెడ్డి సర్వోత్తమ్ రెడ్డిని కాంగ్రెస్ అభ్యర్థులుగా ప్రకటించింది. దీనిపై మల్లన్న మాట్లాడుతూ... ఈ నిర్ణయం తనకు ఆశ్చర్యం కలిగించలేదన్నారు. "రెడ్ల పార్టీ రెడ్లకు కాకుండా బీసీలకు టికెట్లు ఇస్తేనే ఆశ్చర్యపడాలి" అని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్లోని రెడ్లు ఓ నాటకమాడారని, ఈ కేటాయింపుల వెనుక జానారెడ్డితో పాటు మరో టీచర్ ఎమ్మెల్సీ, ఇంకో రెడ్డి నేత కుట్ర ఉందని ఆరోపించారు.కాంగ్రెస్ ప్రకటించిన ఇద్దరు అభ్యర్థులు కేవలం 'బలిపశువులు' మాత్రమేనని మల్లన్న అభివర్ణించారు. పార్టీ గెలవడం కాదు, రెడ్లు గెలవాలన్నదే వారి లక్ష్యమని, దీని కోసం బీఆర్ఎస్లోని ఒక వ్యక్తితో రహస్య ఒప్పందం కూడా కుదిరిందని ఆరోపించారు. ఈ స్థానాల్లో కాంగ్రెస్కు గతంలో కనీసం డిపాజిట్లు కూడా దక్కలేదని, తాను గెలిచిన తర్వాతే అక్కడ ఆ పార్టీకి గుర్తింపు వచ్చిందని గుర్తుచేశారు.ఈ ఎన్నికలు రెడ్లు, వెలమలకు, బీసీలకు మధ్య జరుగుతున్న పోరాటంగా ఆయన అభివర్ణించారు. రాష్ట్రంలో బీసీ వాదం లేదని నిరూపించే ప్రయత్నం జరుగుతోందన్నారు. తమ తెలంగాణ రాజ్య అధికార పార్టీ తరఫున రెండు స్థానాల్లోనూ బీసీ అభ్యర్థులను నిలబెట్టి గెలిపిస్తామని తీన్మార్ మల్లన్న ధీమా వ్యక్తం చేశారు. తన అభ్యర్థిత్వంపై త్వరలోనే స్పష్టత వస్తుందని తెలిపారు.

# సింగరేణి ఓసిపి లు కాంట్రాక్టర్ల మయం అయ్యాయి

మొదటిపేజీ తరువాయి...

చేస్తున్నాం. సింగరేణి సంస్థ కు రావాల్సిన బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చెల్లించాలి. సింగరేణి కార్మికుల ఆగ్రహానికి గురి కాకముందే ప్రభుత్వం స్పందించి సమస్యలు పరిష్కరించాలి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మళ్ళీ పాతాపంథాను కొనసాగిస్తోంది. రాష్ట్రంలో 8 గంటల కరెంట్ కూడా సరిగా ఇవ్వడం లేదు. నాణ్యమైన కరెంటు రాకపోవడంతో రైతుల మోటార్లు కలిపోతున్నాయి. రైతుల సమస్యలు పరిష్కరించే పరిస్థితి లో ఈ ప్రభుత్వం లేదు. అధికారం రాగానే పదవులు కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి మూడేళ్లు గడుస్తున్నా ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయడం లేదు. రాజకీయాలు పక్కన పెట్టి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలి . కాళేశ్వరం ప్రాజెక్టులో లోపాలు సరిచేసి నీటిని ఎత్తిపోసి రైతాంగానికి సాగునీరు అందించాలని అన్నారు.

## కాంగ్రెస్ పార్టీలోకి జగన్ చేరుతారంటూ

## ప్రచారం జరుగుతున్న వేళ..

# మల్లు భట్టి కీలక వ్యాఖ్యలు!

మొదటిపేజీ తరువాయి...

ఇదే సమయంలో కేంద్ర ప్రభుత్వంపై భట్టి తీవ్ర విమర్శలు చేశారు.తాము చెల్లించే ప్రతి రూపాయి పన్నుకు బదులుగా తెలంగాణకు కేవలం 43 పైసలు మాత్రమే తిరిగి వస్తున్నాయని ఆరోపించారు. దక్షిణాది రాష్ట్రాలపై కేంద్రం వివక్ష చూపుతోందని, సమాఖ్య స్ఫూర్తిని దెబ్బతీస్తోందని మండిపడ్డారు. ఇదే సమయంలో, ఓటర్ల జాబితా సవరణలో అక్రమాలు జరుగుతున్నాయని, ఇది బీజేపీకి లబ్ధి చేకూర్చేలా ఉందని ఆరో పిస్తూ... చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న గ్యారెంటీ పథకాలను ఆయన సమర్థిం చుకున్నారు. ఇవి ఉచితాలు కావని, పేదలకు ఆత్మగౌరవాన్ని ఇచ్చి, వారి కొనుగోలు శక్తిని పెంచడం ద్వారా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసే చర్యలని స్పష్టం చేశారు.

# ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన ఏర్పాట్లపై కూన శ్రీశైలం గౌడ్ సమీక్ష

**కుత్బుల్లాపూర్,30:** సిరిసిల్ల నియోజకవర్గంలోని సిరిసిల్ల పట్టణంలో రేపు జరగనున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన నేపథ్యంలో కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే, కరీంనగర్ పార్లమెంట్ కోఆర్డినేటర్ కూన శ్రీశైలం గౌడ్ మంగళవారం తంగళ్లపల్లి మండల కాంగ్రెస్ నాయకులతో కలిసి ముఖ్య నాయకులతో సన్నాహక సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి జన సమీకరణ,సభా ఏర్పాట్లు, ఇతర కార్యక్రమాల నిర్వహణపై నాయకులతో చర్చించారు. ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయాలని, అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొనేలా అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు.ఈ సమావేశంలో తంగళ్లపల్లి మండల కాంగ్రెస్



అధ్యక్షుడు మునిగే రాజు, సర్ కోఆర్డినేటర్ ప్రవీణ్ టోనీ, ముఖ్య నాయకులు, ఇతర నేతలు పాల్గొన్నారు.

# సీపీఎం సీనియర్ నాయకులు కొంపల్లి వీరయ్యకు నివాళులర్పించిన మాజీ మంత్రి సత్యవతి రాథోడ్

**కురవి30:** కురవి మండలం తట్టుపల్లి గ్రామానికి చెందిన సీపీఎం పార్టీ సీనియర్ నాయకులు కొంపల్లి వీరయ్య ఇటీవల మృతి చెందగా, నేడు మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ తట్టుపల్లి గ్రామంలోని వారి నివాసానికి చేరుకున్నారు. వీరయ్యరి పార్థివ దేహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించిన అనంతరం, వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు, వీరయ్య మృతి గ్రామానికి, పార్టీకి తీరని లోటని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి సాధుల శ్రీనివాస్, ఐలి నరహరి గౌడ్, మన్యు ప్యాట్నీ,బొడ శ్రీను నాయక్, గుగులోత్ నెహ్రూ నాయక్, గునిగంటి రాజన్న, సర్పంచ్ ఎడ్ల శ్రీనివాస్ రెడ్డి, రాజు, సాధుల శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ పోతుగంటి వెంకన్న, మాజీ సర్పంచ్ పోరెడ్డి రాంరెడ్డి, సైదులు,



అంతటి సురేష్ తదితరులు పాల్గొన్నారు

R. REPUBLIC HINDUSTAN
రిపబ్లిక్ హిందుస్థాన్
తెలుగు దినపత్రిక
RNI REG.NO. TELTEL/2021/83468

# అట్రాసిటీ బాధితులకు సత్వర న్యాయం

**జిల్లా కలెక్టర్ కె.హరిత**



**ఆసిఫాబాద్‌జిల్లా ప్రతినిధి సెప్టెంబరు 30:** అట్రాసిటీ కేసుల్లో బాధితులకు సత్వర న్యాయం అందించడంతోపాటు ప్రభుత్వం నుంచి పరిహారం మంజూరయ్యేలా చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ కె.హరిత తెలిపారు.కలెక్టర్ కార్యాలయంలో బుధవారం ఎస్పీ నితికా పంత్, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ హర్ష చౌదరితో కలిసి డిస్ట్రిక్ట్ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులతో అట్రాసిటీ కేసులపై సమీక్ష ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు 39 అట్రాసిటీ కేసులు నమోదయ్యాయని తెలిపారు. ప్రతి కేసును క్షేత్రస్థాయిలో సమగ్రంగా విచారించి బాధితులకు త్వరితగతిన న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. అర్హులైన బాధితులకు పరిహారం అందించేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతామని పేర్కొన్నారు.సమావేశంలో ఆర్డీవో లోకేశ్వర్‌రావు, ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ డీఎస్పీలు అశోక్, వహీదుద్దీన్, షెడ్యూల్డ్ కులాల సంక్షేమశాఖ అధికారి అశోక్, విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు సిడాం అర్జు, గోపాల్, అశోక్, కేశవరావు, గణేష్, గంగుబాయితో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# రాంనగర్ సెక్టార్‌లో ఘనంగా పోషణ మాసం కార్యక్రమం

**జిల్లా సంక్షేమ శాఖ అధికారి రౌఫ్ ఖాన్**



**మంచిర్యాల ప్రతినిధి సెప్టెంబరు30:** మహిళ, శిశు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం పోషణ మాసం కార్యక్రమాన్ని అమలు చేస్తుందని, ఈ క్రమంలో బుధవారం మంచిర్యాల పట్టణంలోని రాంనగర్ సెక్టార్ లో పోషణ మాసం ను ఘనంగా నిర్వహించడం జరిగిందని జిల్లా మహిళా, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ అధికారి రౌఫ్ ఖాన్ అన్నారు. మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ సల్లా రమ్య, డివిజన్ కార్పొరేటర్ శ్రీలక్ష్మి, సి డి పి ఓ విష్ణుప్రియ, సూపర్‌వైజర్ జ్యోతి లతో కలిసి గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు అవసరమైన పోషకాహారం, ఆరోగ్య సంరక్షణ, వ్యక్తిగత పరిశుభ్రత, చిన్నారుల ఆరోగ్యకరమైన ఎదుగుదలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా సంక్షేమ శాఖ అధికారి మాట్లాడుతూ గర్భిణీలు, బాలింతలు సమతుల్యమైన పోషకాహారం తీసుకోవడం ద్వారా తల్లి, శిశువు ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని, చిన్నారులకు పౌష్టికాహారం అందించడంతో పాటు పరిశుభ్రత, ఆరోగ్యకరమైన జీవన విధానాలను చిన్ననాటి నుంచే అలవర్చాలని తెలిపారు. పోషణ మాసం కార్యక్రమం ద్వారా గర్భిణీలు, బాలింతలు, చిన్నారులలో పోషకాహారం, ఆరోగ్య సంరక్షణ, పరిశుభ్రత, ప్రారంభ విద్యపై అవగాహన మరింత పెంచాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, ఆరోగ్యకరమైన తరం నిర్మాణానికి తల్లిదండ్రులు, అంగన్‌వాడీ సిబ్బంది, అధికారులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు.అనంతరం గర్భిణీలకు శ్రీమంతాల కార్యక్రమం, చిన్నారులకు అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో బి.సి. సతీష్, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, తల్లులు, గర్భిణీలు, చిన్నారులు పాల్గొన్నారు.

# రహదారి ప్రమాదాల నివారణకు చర్యలు

**కలెక్టర్ కె. హరిత**



**ఆసిఫాబాద్‌జిల్లా ప్రతినిధి సెప్టెంబరు 30:** జిల్లాలో రహదారి ప్రమాదాల నివారణకు ముందస్తు రక్షణ చర్యలు చేపట్టాలని కలెక్టర్ కె. హరిత అన్నారు. బుధవారం ఎస్పీ నితికా పంత్, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ హర్ష చౌదరి, ఆసిఫాబాద్ ఆర్డీవో లోకేశ్వర్‌రావుతో కలిసి సంబంధిత శాఖల అధికారులతో రహదారి భద్రత, ప్రమాదాల నివారణపై సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ రహదారిపై ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను గుర్తించి అవసరమైన రక్షణ చర్యలు చేపట్టాలన్నారు. ప్రధాన రహదారులు, మున్సిపాలిటీలు, మండల కేంద్రాల్లో పశువులు, కుక్కలు రహదారులపైకి రాకుండా వాటి యజమానులకు అవగాహన కల్పించాలని సూచించారు. రహదారులు, భవనాలు, పంచాయతీరాజ్ శాఖల పరిధిలోని రహదారులపై ఉన్న గుంతలను వెంటనే పూడ్చాలని ఆదేశించారు.పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు రహదారి భద్రత, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించాలని తెలిపారు. ఆటో, ఇతర వాహన డ్రైవర్లు మద్యం సేవించి వాహనాలు నడపకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్, సీట్‌బెల్ట్ ధరించేలా తనిఖీలు నిర్వహించాలని సూచించారు. మైనర్లు వాహనాలు నడపకుండా ప్రత్యేక తనిఖీలు చేపట్టడంతోపాటు మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేయాలని ఆదేశించారు.ప్రమాదం జరిగిన వెంటనే క్షతగాత్రులను సమీప ఆసుపత్రులకు తరలించేలా అంబులెన్సులను అందుబాటులో ఉంచాలని తెలిపారు. రహదారి ప్రమాదాల నివారణకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు.ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ డీఎస్పీలు అశోక్, వహీదుద్దీన్, జిల్లా పంచాయతీ అధికారి భిక్షపతి, రహదారులు--భవనాలు, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ ఈఈ ధర్మేందర్, జిల్లా రవాణా అధికారులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు నాణ్యమైన విద్యా బోధన అందించాలి

**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**మంచిర్యాల ప్రతినిధి సెప్టెంబరు30:** ప్రభుత్వ విద్యాసంస్థలలో చదువుతున్న విద్యార్థినీ, విద్యార్థులకు నాణ్యమైన విద్య బోధన అందించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లాలోని నెన్నెల మండల కేంద్రంలో గల కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి అదనపు గదులు, వంటశాల, తరగతి గదులు, రిజిస్టర్లు, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలలో చదువుతున్న విద్యార్థినీ, విద్యార్థులకు నాణ్యమైన విద్యా బోధనతో పాటు మెనూ ప్రకారం సకాలంలో రుచికరమైన పౌష్టిక ఆహారం అందించాలని, విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. అన్ని ప్రభుత్వ పాఠశాలలలో సకల సౌకర్యాలు కల్పించి విద్యార్థులకు గుణాత్మక విద్యను అందించే దిశగా ప్రభుత్వం తీసుకుంటున్న కార్యక్రమాలను విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించి తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించేలా ఉపాధ్యాయులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా డిజిటలైజేషన్ ను వేగవంతం చేయాలి

**జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు**



**మంచిర్యాల ప్రతినిధి సెప్టెంబరు30:** ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు అన్నారు. బుధవారం జిల్లాలోని దండేపల్లి మండల తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించి అధికారులతో పలు అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ఇప్పటికే నిర్వహించిన విచారణలకు సంబంధించిన కేసుల డిజిటలైజేషన్‌ను వేగవంతం చేయాలని, తదుపరి 2 రోజులలో పురోగతిని స్పష్టంగా చూపించాలని అధికారులను ఆదేశించారు. సాదాబైనామా, భూ భారతి దరఖాస్తులపై సమీక్ష నిర్వహించి పెండింగ్ లో ఉన్న దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి రికార్డులను అనుసరించి నియమ నిబంధనల ప్రకారం పరిష్కరించాలని, మీ-సేవా ధ్రువపత్రాలను ప్రాధాన్యతా క్రమంలో పరిశీలించి, నిబంధనల ప్రకారం నిర్ణీత సమయంలోగా పరిష్కరించాలని తెలిపారు.అంతకుముందు జిల్లాలోని జన్నారం మండల కేంద్రంలో గల తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించి రెండ్లగూడ గ్రామంలోని సర్వే నంబర్లు 160, 161 కి సంబంధించిన "అల్లం వారి కుంట" అంశంపై ప్రజావాణిలో అందిన ఫిర్యాదుపై కలెక్టరేట్ సూపరింటెండెంట్-బి, జన్నారం నీటిపారుదల శాఖ ఎఈఈ లతో కలిసి విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ ఫిర్యాదుదారుల వాదనలు విని, సమస్యకు సంబంధించిన అంశాలను పరిశీలించి, జన్నారం తహసిల్దార్, మండల గిర్దావర్‌కు తదుపరి అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలి

**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**




**మంచిర్యాల ప్రతినిధి సెప్టెంబరు30:** సాధారణంగా సాగుచేసే వరి పత్తి మొక్కజొన్న కాకుండా ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లాలోని బెల్లంపల్లి మండల కేంద్రంలో గల కృషి విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన కిసాన్ మేళా కార్యక్రమానికి సిర్పూర్ నియోజకవర్గ శాసనసభ్యులు పాల్వాయి హరీష్ బాబు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ విలాయత్ అలీ, జిల్లా వ్యవసాయ అధికారి సురేఖ, కృషి విజ్ఞాన కేంద్రం ప్రతినిధులు మహేష్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ లు రత్నం సుకుమారి, రామగిరి బానేష్, అక్కల వెంకటేశ్వర్లు, దుర్గం లక్ష్మీనారాయణ, మహేష్ ప్రసాద్ తివారి, ఆత్మ చైర్మన్ లు ఆర్. సత్తయ్య, ఓడేటి హనుమంతు, సింగతి మురళి, రఘునందన్ రెడ్డి లతో కలిసి హాజరై స్టాళ్లను పరిశీలించి, మొక్కలు నాటారు. అనంతరం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతులు వరి, పత్తి పంటలతో పాటు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉండి అధిక లాభాలను అందించే ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని తెలిపారు. ఫర్టిలైజర్స్, సేంద్రియ వ్యవసాయం, పామాయిల్ సాగు, డ్రిప్ ఇరిగేషన్ వ్యవస్థలు, మత్స్యశాఖకు సంబంధించిన ఉత్పత్తులు, వ్యవసాయానికి ఉపయోగపడే ఎలక్ట్రానిక్ వాహనాలు రైతులు వినియోగించుకోవాలని తెలిపారు. సాంకేతికతతో రైతులకు కలిగే ప్రయోజనాలను వివరించాలని, ఆధునిక వ్యవసాయ సాంకేతికతను వినియోగించుకోవడం ద్వారా సాగు ఖర్చులను తగ్గించుకుని, ఉత్పాదకతను పెంచుకోవచ్చని రైతులకు సూచించారు. రైతులు సంప్రదాయ పంటలతో పాటు మార్కెట్ పరిస్థితులు, పంటలకు లభించే ధరలు, సాగు వ్యయం, నీటి లభ్యత తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని అధిక లాభాలను అందించే పంటలను ఎంచుకోవాలని తెలిపారు. ఆయిల్ పామ్, పందిరి సాగు, పండ్ల సాగు వంటి పంటలపై దృష్టి సారించేలా రైతులను ప్రోత్సహించాలని తెలిపారు. రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు అందిస్తూ వ్యవసాయాన్ని మరింత లాభసాటిగా మార్చేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. నేషనల్ లైవ్ స్టాక్ మిషన్ పథకంలో అందిస్తున్న రాయితీని సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని, మత్స్యశాఖ ఆధ్వర్యంలో మత్స్యకారుల కొరకు చేప పిల్లలను ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేసిందని తెలిపారు. ఎల్ నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకొని సాగు ప్రణాళిక పకడ్బందీగా చేసుకోవాలని, నానో యూరియా, నానో డి ఎ పి వినియోగం వలన కలిగే లాభాలను రైతులకు వివరించాలని తెలిపారు. రైతుల కొరకు జిల్లాలోని లక్షెట్టిపేటలో విత్తన శుద్ధి కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని, మిల్క్ ప్రాసెసింగ్ యూనిట్ ద్వారా కలిగే ప్రయోజనాలను రైతులు తెలుసుకోవాలని తెలిపారు. ప్రభుత్వాలు కల్పిస్తున్న రాయితీ, సహకారాన్ని రైతులకు వివరించి పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ఆరోగ్యవైన పంట ఉత్పాదకత పెంపొందించేలా అధికారులు, స్వయం సహాయక సంఘాల సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు.సిర్పూర్ శాసనసభ్యులు మాట్లాడుతూ రైతులు సేంద్రియ ఎరువులను తయారు చేసుకోవాలని, ప్రజలకు ఆరోగ్యకరమైన, సహజసిద్ధమైన పంట ఉత్పత్తులను అందించేలా కృషి చేయాలని తెలిపారు. వరి, మొక్క, పత్తి వంటి సాధారణ పంటలే కాకుండా ప్రస్తుత వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులు దృష్టి సారించాలని తెలిపారు. ప్రభుత్వం రైతు సంక్షేమంలో భాగంగా కల్పిస్తున్న అవకాశాలపై రైతులు చైతన్యవంతులు కావాలని, ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు, అధికారులు అందిస్తున్న పంట మెలకువలు, సూచనలను పాటిస్తూ తక్కువ నీటి వినియోగంతో ఎక్కువ పంట దిగుబడి సాధించి, ఆర్థికంగా అభివృద్ధి చెందేలా రైతులు ముందుకు రావాలని తెలిపారు.

అనంతరం జిల్లాలో ఉత్తమంగా వ్యవసాయం చేస్తున్న రైతులను శాలువాలతో సన్మానించారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, వివిధ సంస్థల ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.



# బయోకెమిస్ట్రీ ల్యాబ్‌లో నూతన యంత్రం

**వారం రోజుల్లో అందుబాటులోకి.. వేగంగా పరీక్షలు**



జిల్లా కేంద్రంలోని గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ (జీజీహెచ్) బయోకెమిస్ట్రీ ల్యాబ్‌లో నూతన యంత్రాన్ని ఏర్పాటు చేస్తున్నారు. హైదరాబాద్‌కు చెందిన కంపెనీ ప్రతినిధులు గురువారం ఆసుపత్రికి చేరుకుని యంత్రం ఇన్‌స్టాలేషన్ పనులు చేపట్టడంతోపాటు దాని పనితీరు, వినియోగంపై సిబ్బందికి అవగాహన కల్పించారు.

నూతన యంత్రం వారం రోజుల్లో అందుబాటులోకి రానుందని ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. దీని ద్వారా రోగులకు అవసరమైన బయోకెమిస్ట్రీ పరీక్షలను మరింత వేగంగా, సులభంగా నిర్వహించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. పరీక్షల ఫలితాలు త్వరగా అందుబాటులోకి రావడంతో వైద్యులు రోగుల ఆరోగ్య పరిస్థితిని సకాలంలో అంచనా వేసి, అవసరమైన చికిత్స అందించేందుకు దోహదపడుతుందని తెలిపారు.జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ (ప్రొఫెసర్, జనరల్ మెడిసిన్) పర్యవేక్షణలో ల్యాబ్ సేవలను మరింత మెరుగుపరిచేందుకు చర్యలు చేపడుతున్నట్లు ఆసుపత్రి వర్గాలు వెల్లడించాయి. నూతన యంత్రం అందుబాటులోకి రావడంతో రోగులకు మెరుగైన వైద్య పరీక్షా సేవలు అందనున్నాయని పేర్కొన్నారు.

**నర్సింగ్ సూపరింటెండెంట్‌కు ఘన వీడ్కోలు.....**

ఆసిఫాబాద్ కేంద్రంలోని గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్‌లో నర్సింగ్ సూపరింటెండెంట్ ఆఫీసర్ గ్రేడ్--2 విరోనికా పదవీ విరమణ సందర్భంగా ఘనంగా వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి వైద్యులు, నర్సింగ్ అధికారులు, సిబ్బంది ఆమె అందించిన సేవలను గుర్తుచేసుకుని అభినందనలు తెలిపారు.విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేస్తూ రోగులకు అందించిన సేవలను పలువురు కొనియాడారు. పదవీ విరమణ అనంతరం ఆమె ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ (ప్రొఫెసర్, జనరల్ మెడిసిన్), ఏ.డీ. రాజకుమార్, ఏవో తిరుపతి, ఆఫీస్ సూపరింటెండెంట్లు గడ్డం సాయి కిషోర్, ఏ. రాకేష్, ఆర్. మయూర్, చీఫ్ నర్సింగ్ ఆఫీసర్ విజయమ్మతోపాటు వైద్యులు, నర్సింగ్ అధికారులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా విరోనికాను శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా వీడ్కోలు పలికారు.

# లెర్నింగ్‌తో గణిత బోధనలో మెరుగైన ఫలితాలు

## అదనపు కలెక్టర్ యువరాజ్ మర్మాట్



**ఆసిఫాబాద్‌జిల్లా ప్రతినిధి సెప్టెంబరు 30:** డిజిటల్ లెర్నింగ్ విధానంతో గణిత బోధనను మరింత సమర్థవంతంగా నిర్వహించవచ్చని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాలలో గణిత ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న 'ఎ బుక్ ఆన్ డిజిటల్ లెర్నింగ్' శిక్షణ కార్యక్రమానికి జిల్లా విద్యాశాఖ అధికారి సచ్చిదానంద చారితో కలిసి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. విద్యార్థుల్లో గణితంపై ఆసక్తిని పెంపొందించడంతో పాటు తార్కిక ఆలోచన, సమస్య పరిష్కార నైపుణ్యాలను అభివృద్ధి చేసేందుకు ఆధునిక సాంకేతికతను గణిత బోధనలో విస్తృతంగా వినియోగించాలని సూచించారు. సంప్రదాయ బోధనా పద్ధతులతో పాటు డిజిటల్ వనరులను సమర్థంగా వినియోగిస్తే క్లిష్టమైన గణిత భావనలను సులభంగా, ఆసక్తికరంగా, దృశ్యరూపంలో విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించవచ్చన్నారు. సాంకేతికతను ఉపాధ్యాయుడి బోధనా సామర్థ్యాన్ని పెంచే సాధనంగా ఉపయోగించుకోవాలని సూచించారు. శిక్షణలో పొందిన జ్ఞానం, నైపుణ్యాలను తరగతి గదుల్లో ఆచరణలోకి తీసుకువచ్చి ప్రతి విద్యార్థికి నాణ్యమైన గణిత అభ్యాసాన్ని అందించాలన్నారు. విద్యార్థుల అభ్యాస స్థాయికి అనుగుణంగా డిజిటల్ వనరులను వినియోగిస్తూ 'లెర్నింగ్ బై డూయింగ్', 'యాక్టివిటీ బేస్డ్ లెర్నింగ్' విధానాలను ప్రోత్సహించాలని చెప్పారు. విద్యార్థుల్లో కనీస అభ్యాస సామర్థ్యాల సాధన, గణిత అభ్యాస ఫలితాల మెరుగుదలకు ఉపాధ్యాయులు సమన్వయంతో కృషి చేయాలని కోరారు. నిరంతర వృత్తిపరమైన అభివృద్ధి విద్యా ప్రమాణాల పెంపునకు దోహదపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో విద్యాశాఖ నాణ్యత సమన్వయకర్త ఉప్పులేటి శ్రీనివాస్, కేంద్ర నిర్వాహకులు మహేశ్వర్, రిసోర్స్ పర్సన్లు, గణిత ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# కల్తీ ఆహారంపై ఉక్కుపాదం

## జిల్లా కలెక్టర్ కె.హరిత



**ఆసిఫాబాద్‌జిల్లా ప్రతినిధి సెప్టెంబరు 30:** హోటళ్లు, బేకరీలు, తినుబండారాల దుకాణాలు, గురుకుల పాఠశాలలు, వసతి గృహాల్లో కల్తీ పదార్థాల వినియోగాన్ని అరికట్టాలని కలెక్టర్ కె.హరిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ డేవిడ్‌తో కలిసి జిల్లా స్థాయి ఆహార భద్రత సలహా కమిటీ సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ హోటళ్లు, బేకరీలు, తినుబండారాల దుకాణాల్లో ఆహార భద్రత అధికారులు విస్తృతంగా తనిఖీలు చేపట్టి కల్తీ పదార్థాల వినియోగాన్ని అరికట్టాలని సూచించారు. వ్యాపార అనుమతులు, దుకాణాల రిజిస్ట్రేషన్లను పరిశీలించాలని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సంక్షేమ, రెసిడెన్షియల్ వసతి గృహాలు, ఆశ్రమ పాఠశాలల్లో ఆహార తయారీకి వినియోగించే ముడి పదార్థాల నాణ్యతను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని తెలిపారు. ఆహారం ద్వారా వ్యాపించే వ్యాధులు, విషబాధ ఘటనలు చోటుచేసుకోకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. తనిఖీల్లో గుర్తించిన కల్తీ పదార్థాలు, సంబంధిత వ్యాపార సంస్థల వివరాలను ప్రజలకు తెలిసేలా పత్రికల్లో ప్రచురించే విధంగా ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి సచ్చిదానందచారి, జిల్లా పంచాయతీ అధికారి భిక్షపతి, ఫుడ్ సేఫ్టీ డిజిగ్నేటెడ్ అధికారి వాసురావు, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ మహేందర్, వైద్యులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# లెక్కల పంచాయితీ.. కత్తులతో దాడి

### వైన్స్ భాగస్వామిపై హత్యాయత్నం ఆరోపణ
### చేతులు, ఛాతీ, కాళ్లు, తొడలు, భుజాలపై గాయాలు
### రిమ్స్‌లో చికిత్స.. పోలీసులకు బాధితుడి ఫిర్యాదు



**జననినాదం,సిరికొండ 30:** వైన్స్ వ్యాపార లావాదేవీల లెక్కల విషయంలో తలెత్తిన వివాదం కత్తితో దాడికి దారితీసింది. సిరికొండలోని శ్రీలక్ష్మీసాయి వైన్స్ భాగస్వామి దేశెట్టి రాకేష్‌పై బస్సి హరిష్ అనే వ్యక్తి కత్తితో దాడి చేసినట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బుధవారం మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో ఈ ఘటన జరిగినట్లు పేర్కొన్నాడు. రాకేష్ తెలిపిన వివరాల ప్రకారం వైన్స్‌ను నలుగురు భాగస్వాములు కలిసి నిర్వహిస్తున్నారు. లావాదేవీల లెక్కల విషయంలో గతంలో భాగస్వాముల మధ్య వివాదం తలెత్తింది. ఈ క్రమంలో బస్సి పత్తిసింగ్‌పై గత నెలలో పోలీసులకు ఫిర్యాదు చేశారు. బుధవారం లెక్కలు చూసేందుకు సమావేశం ఏర్పాటు చేసుకున్నారు.

ఈ సమయంలో బస్సి పత్తిసింగ్ కుమారుడు హరిష్ కత్తితో తనపై దాడి చేశాడని రాకేష్ ఆరోపించాడు. కడుపులో పొడిచేందుకు ప్రయత్నించగా చేతులతో అడ్డుకోవడంతో రెండు చేతులకు తీవ్ర గాయాలయ్యాయని తెలిపాడు. అనంతరం ఛాతీ, కాళ్లు, తొడలు, భుజాలపై కూడా కత్తితో దాడి చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నాడు. తన వెంట ఉన్న ముండే బాబు, ఆడే ఉపేందర్ తనను కాపాడినట్లు తెలిపాడు. దాడిలో తీవ్రంగా గాయపడిన రాకేష్‌ను వెంటనే కారులో రిమ్స్ ఆదిలాబాద్‌కు తరలించారు. చికిత్స అనంతరం సిరికొండ పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేశాడు. గతంలోనే తనకు ప్రాణహాని ఉందని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నాడు. తనపై దాడి చేసిన హరిష్‌తో పాటు అతని తండ్రి బస్సి పత్తిసింగ్‌పై విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, తనకు రక్షణ కల్పించాలని పోలీసులను కోరాడు.

# బాలికల వసతి గృహంలో డీడీ జాదవ్ అంబాజీ ఆకస్మిక తనిఖీ



**ఆసిఫాబాద్‌జిల్లా ప్రతినిధి సెప్టెంబరు 30:** కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలను జిల్లా గిరిజన సంక్షేమ ఉప సంచాలకులు జాదవ్ అంబాజీ బుధవారం ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో విద్యార్థినుల హాజరు, తరగతి గదుల్లో బోధన, వసతి గృహ నిర్వహణ, భోజనశాల, వంటశాల, పరిశుభ్రత, తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్ల నిర్వహణ, వైద్య సదుపాయాలు, విద్యార్థుల భద్రతా చర్యలను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. విద్యార్థినులతో నేరుగా మాట్లాడి వారి విద్యాభ్యాసం, భోజన నాణ్యత, వసతి సౌకర్యాలు, ఆరోగ్యం, పాఠశాలలో ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి విద్యార్థినికి నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతి, పౌష్టికాహారం అందేలా ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని సూచించారు. పాఠశాల పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచడంతో పాటు బాలికల ఆరోగ్యం, భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, విద్యా సౌకర్యాలు విద్యార్థులకు పూర్తి స్థాయిలో అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. అనంతరం పాఠశాలల్లోని రికార్డులు, విద్యార్థుల హాజరు, వసతి గృహ నిర్వహణ తదితర అంశాలను పరిశీలించి, విద్యార్థుల సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి పరిష్కరించాలని సిబ్బందికి సూచించారు. ఆకస్మిక తనిఖీల ద్వారా పాఠశాలల నిర్వహణ మరింత మెరుగుపడాలని, విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించడమే గిరిజన సంక్షేమ శాఖ ప్రధాన లక్ష్యమని జాదవ్ అంబాజీ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ జాదవ్ మహేశ్వరి, కళాశాల ప్రిన్సిపాల్ అరుణ శ్రీ, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్యంపై అవగాహన కల్పించాలి



**మంచిర్యాల ప్రతినిధి సెప్టెంబరు30:** వివిధ అనారోగ్య సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించి, సకాలంలో వైద్యులను సంప్రదించాలని గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ సూపరింటెండెంట్, ప్రొఫెసర్ జనరల్ మెడిసిన్ డాక్టర్ కిరణ్ సూచించారు. బుధవారం ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో అడల్ట్ హెల్త్ నర్సింగ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆరోగ్య అవగాహన వర్క్‌షాప్‌కు ఆయన ముఖ్యాతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కిడ్నీలో రాళ్లు, రొమ్ము క్యాన్సర్, కంటిశుక్లం, కాలిన గాయాలు, మెదడు పక్షవాతం తదితర ఆరోగ్య సమస్యలపై విద్యార్థులు అవగాహన స్టాళ్లను ఏర్పాటు చేశారు. ఆయా వ్యాధుల లక్షణాలు, నివారణ చర్యలు, చికిత్స విధానాలు, అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను స్టాళ్ల ద్వారా వివరించారు. డాక్టర్ కిరణ్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం రిబ్బన్ కట్ చేసి ఆరోగ్య అవగాహన స్టాళ్లను ప్రారంభించి, విద్యార్థులు ప్రదర్శించిన అంశాలను పరిశీలించారు. ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించడంలో విద్యార్థులు చురుకైన పాత్ర పోషించాలని సూచించారు. ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవడం ద్వారా పలు అనారోగ్య సమస్యలను నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఐ. పద్మలత, వైస్ ప్రిన్సిపాల్ ఈ. పద్మ, బోధనా సిబ్బంది ఎం. శారద, రాథోడ్ ప్రేమదాస్, ఎం.కె. హర్షిణి, డి. సంతోష్, పి. సంజీవ్, విద్యార్థులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కథల రచనతో సృజనాత్మకతకు పదును



**సిర్పూర్(యు),కెరమెరి సెప్టెంబరు30:** విద్యార్థుల్లో సృజనాత్మకత, రచనా నైపుణ్యాలను పెంపొందించేందుకు ఏకలవ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో జడ్పీహెచ్ఎస్ కిరమేరి పాఠశాలలో శుక్రవారం పాఠశాల స్థాయి కథల రచన పోటీలు నిర్వహించారు. జూనియర్, సీనియర్ విభాగాల్లో విద్యార్థులకు స్టోరీ రైటింగ్ పోటీలు నిర్వహించి వారిలోని ప్రతిభను వెలికితీసేందుకు ప్రోత్సహించారు. పోటీల్లో ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలిచిన విద్యార్థులకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతోపాటు ఇతర సృజనాత్మక, సహపాఠ్య కార్యక్రమాల్లోనూ చురుకుగా పాల్గొని తమ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవీందర్ జాదవ్, గోపాల్‌తో పాటు ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి

## టీఎస్ యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కాంపెల్లి ఊశన్న



**సిర్పూర్(యు),సెప్టెంబరు30:** ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని టీఎస్ యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కాంపెల్లి ఊశన్న డిమాండ్ చేశారు. బుధవారం సిర్పూర్(యు), జైనూర్, లింగాపూర్ మండలాల్లో సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. జిల్లా పరిషత్, ప్రభుత్వ ఆశ్రమోన్నత, మండల పరిషత్ పాఠశాలలు, కేజీబీవీలను సందర్శించి సభ్యత్వాన్ని నమోదు చేశారు. ఈ సందర్భంగా ఊశన్న మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే పీఆర్సీని ప్రకటించి అమలు చేయాలని, సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని, 2003 డీఎస్సీ ఉపాధ్యాయులను ఓపీఎస్‌లోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. పెండింగ్ బకాయిలను తక్షణమే చెల్లించాలన్నారు. వివిధ గురుకులాల్లో పనిచేస్తున్న పార్ట్‌టైం, గెస్ట్ ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, 12 నెలల వేతనం చెల్లించాలని, గురుకులాల్లో కేర్‌టేకర్లు, హాస్టల్ వార్డెన్లను నియమించాలని తెలిపారు. కేజీబీవీ ఉద్యోగులు, గురుకుల ఉపాధ్యాయులు, ప్రభుత్వ ఆశ్రమోన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న సీఆర్‌టీలకు మినిమం టైం స్కేల్ వర్తింపజేయాలన్నారు. అందరికీ హెల్త్ కార్డులు అందించి నాణ్యమైన వైద్యం అందించాలని పేర్కొన్నారు. వివిధ యాజమాన్యాల పరిధిలోని గురుకులాల్లో సమయసారిణి ఒకే విధంగా లేదని, దీనిపై ప్రభుత్వం దృష్టిసారించి ఏకరీతి సమయసారిణిని అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో త్రిముఖ్‌రావు, రాజేశ్వర్ రాథోడ్, మోరె వెంకటి, రాజలింగు, ప్రశాంత్ జాదవ్, గోవింద్‌రావు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా జట్టు సిద్ధం



**ఆసిఫాబాద్‌జిల్లా ప్రతినిధి సెప్టెంబరు 30:** కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో టీడబ్ల్యూ మోడల్ స్పోర్ట్స్ స్కూల్‌లో బుధవారం నిర్వహించిన జిల్లా స్థాయి సబ్‌జూనియర్ అథ్లెటిక్స్ సెలక్షన్స్--2026 విజయవంతంగా ముగిశాయి. జిల్లా నలుమూలల నుంచి సుమారు 100 మంది క్రీడాకారులు సెలక్షన్స్‌లో పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా జిల్లా గ్రంథాలయ చైర్మన్ కాంగ్రె అనిల్ హాజరై క్రీడాకారులను అభినందించారు. గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ జాదవ్ అంబాజీ మాట్లాడుతూ.. అక్టోబర్ 11న ఆసిఫాబాద్ జిల్లాలోనే రాష్ట్ర స్థాయి సబ్‌జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ జరగనున్న నేపథ్యంలో ప్రతిభావంతులతో జిల్లా జట్టును పటిష్ఠంగా తీర్చిదిద్దాలని, రాష్ట్రస్థాయి పోటీల నిర్వహణకు కమిటీ ఏర్పాటు చేసి బాధ్యతలను విభజించుకోవాలని తెలిపారు. ఐటీడీఏ పీవో మంద మకరంద్ ప్రత్యేక చొరవతో క్రీడా మైదానం మరమ్మతు పనులు చేపడుతున్నారని పేర్కొన్నారు. సెలక్షన్స్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 40 మంది క్రీడాకారులను ఎంపిక చేసి అక్టోబర్ 11న జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా జట్టుగా పంపనున్నట్లు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గుండం లక్ష్మణ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏసీఎంవో ఉద్దవ్, స్పోర్ట్స్ ఆఫీసర్ మడావి శేఖు, జీసీడీవో శకుంతల, యంగ్ ఇండియా నోడల్ ఆఫీసర్ బండ మీనా రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లింబరావు, హెచ్‌డబ్ల్యూ విజయలక్ష్మి, కోచ్‌లు విద్యాసాగర్, అరవింద్, తిరుమల్, వ్యాయామ ఉపాధ్యాయులు సత్యనారాయణ, శ్రీను, సుభాష్, పాండురంగు, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



# మంగి విద్యార్థుల పరుగులు.. రాష్ట్రస్థాయి కి పిలుపులు..!



**తిర్యాణి 30:** జిల్లా కేంద్రానికి దూరంగా.. కనీస సౌకర్యాలకు నోచుకోని అత్యంత మారుమూల గ్రామం మంగి. అలాంటి ప్రాంతం నుంచి వచ్చిన ఆశ్రమ పాఠశాల విద్యార్థులు అథ్లెటిక్స్‌లో అదరగొట్టారు! ఆసిఫాబాద్‌లో జరిగిన జిల్లా స్థాయి సబ్‌జూనియర్ అథ్లెటిక్స్ పోటీల్లో మంగి ఆశ్రమ పాఠశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులు ప్రతిభ చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అవకాశాలు తక్కువైనా.. ఆత్మవిశ్వాసానికి కొదవలేదని విద్యార్థులు నిరూపించారు. జిల్లా స్థాయిలో సత్తా చాటిన వీరు వచ్చే నెల 10, 11 తేదీల్లో ఆసిఫాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు సిద్ధమవుతున్నారు. మారుమూల గ్రామాల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను ప్రోత్సహిస్తే మరిన్ని విజయాలు సాధ్యమని ఈ ఎంపిక చాటిచెబుతోంది. విద్యార్థుల ప్రతిభను పీఈటీ శ్రీనివాస్, డీఎస్ఓ మడావి షేక్, నోడల్ అధికారి మీనారెడ్డి, కార్యదర్శి గుండం లక్ష్మణ్, హెచ్ఎం జగ్గారావు విద్యార్థులను అభినందించి రాష్ట్రస్థాయిలోనూ రాణించాలని ఆకాంక్షించారు.